

# ఎడ్లబండి టు హెలికాప్టర్

**మారిన మేడారం జాతర ప్రయాణ తీరు**

**మాయమవుతున్న ఎడ్లబండ్లు**

**పెరుగుతున్న బస్సులు, కార్లు, ఆటోలు**

భక్తజనమంతా వనమంతా నిండి కుంభమేళాను తలపించే ఆదివాసీల అపూరుపమైన వేడకకు వేళ అయింది. జనం కదిలి వచ్చి కడలిలా మారే అపురూప దృశ్యం మేడారం జాతరలో సాక్షాత్కరించనుంది. ఉత్సాహం ఉరకలేసి ఉత్సవంలా మారే సందర్భంగా రానే వచ్చింది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీల ఉత్సవమైన మేడారం సమ్మక్క సారలమ్మల మహా జాతర నేటి నుంచి ప్రారంభమై 22, 23, 24 వరకు కొనసాగుతుంది. అయితే ఈ జాతరకు వెళ్లే భక్తుల ప్రయాణ తీరు ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఎడ్లబండి నుంచి నేడు హెలికాప్టర్ వరకు మారిన ప్రయాణంపై వరంగల్ వాయిస్ స్పెషల్ ఫోకస్..

## ఎడ్లబండిలో ప్రయాణం

మేడారం జాతరకు రెండు దశాబ్దాల క్రితం వరకు పెద్ద సంఖ్యలో ఎడ్ల బండ్లలో భక్తులు వచ్చేవారు. ఆర్వాత బస్సు సర్వీసులు అందుబాటులోకి రావడంతో బస్సుల్లో ఇక్కడికి చేరుకునేవారు. 2000 సంవత్సరానికన్నా ముందు మేడారానికి వచ్చే బస్సుల సంఖ్య రెండున్నర వేలుగా ఉండేది. ప్రస్తుతం ఈ బస్సుల సంఖ్య ఆరు వేలకు పెరిగింది. మేడారానికి వచ్చే రహదారుల్లో విపరీతమైన వాహనాల ట్రాఫిక్ ఉండడం, తరచూ ప్రమాదాలతో ఎడ్ల బండి లో ఉండే మూగ జీవాలు ప్రమాదానికి గురయ్యేవి. ఈ కారణం చేత మేడరానికి ఎడ్ల బండ్ల ద్వారా వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గత రెండు జాతరల నుంచి ఎడ్ల బండ్ల ద్వారా వచ్చే వారి సంఖ్య వందలకు పడిపోయింది.

## హెలికాప్టర్ వరకు...

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం కు ఆకాశ మార్గంలో వెళ్లేవారి కోసం గత మూడు దఫాల్లో హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన పర్యాటక శాఖ ఎప్పటిలాగే ఈసారి కూడా ఏర్పాట్లు చేసింది. హనుమకొండ నుంచి మేడారం వెళ్లేందుకు ఈ ఏర్పాట్లు చేశారు. ఇందులో ప్రయాణించిన వారికి ప్రత్యేక దర్శనం కూడా ఉంటుంది. మొక్కులు చెల్లించిన తర్వాత తిరుగుపయనం చేస్తారు. ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు సేవలు అందుబాటులో ఉంటుంది.

## ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..

మేడారం జాతరకు ప్రతి ఏడు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కోటికి పైగా వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. హనుమకొండ, వరంగల్ నుంచే కాకుండా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. ఈ ఏడాది జాతరకు 6 వేల పై చిలుకు బస్సులు కేటాయించి భక్తులకు సేవలందిస్తోంది. ప్రత్యేక క్యూలైన్లు, టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సేవలందించేందుకు సమాయత్తమైంది. మహిళలకు మహా లక్ష్మి పథకం కింది ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కూడా కల్పించడంతో రద్దీకి తగ్గట్లుగా బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతోంది.

## కారు ప్రయాణం వైపు చూపు..

మేడారానికి వెళ్లే భక్తులు కారు ప్రయాణం వైపు మొగ్గు చూపుతున్నారు. కుటుంబ సమేతంగా కారులో వెళ్లి మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటున్నారు. కారుతో పాటు ఆటోలు, టూ వీలర్ లో వచ్చి వనదేవతలను దర్శించుకొని అక్కడి వండుకొని తిని వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఎన్ని రకాల ప్రయాణ సర్వీసులు అందుబాటులోకి తెచ్చిన అన్ని సర్వీసులు ప్రయాణికుల రద్దీతో ఉండటం గమనార్హం.

## ముఖ్యమైన స్టేషన్ల వరకు ప్రత్యేక రైళ్లు..

మేడారం జాతర నేపథ్యంలో భారతీయ రైల్వే మంత్రిత్వశాఖ కీలక ప్రకటన చేసింది. మేడారం జాతరకు వెళ్లనున్న భక్తుల సౌకర్యార్థం ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు వెల్లడించింది. 07017/07018: సిర్పూర్ కాగజ్‌నగర్ –వరంగల్ – సిర్పూర్ కాగజ్‌నగర్, 07014/07015: వరంగల్ – సికింద్రాబాద్ – వరంగల్, 07019/0720: నిజామాబాద్ – వరంగల్ – నిజామాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నాయని రైల్వే శాఖ ప్రకటించింది. ఈ ట్రైన్స్ సికింద్రాబాద్, హైదరాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, భోంగీర్, జనగాం, ఘన్‌పూర్, కామారెడ్డి, మనోహరాబాద్, మేడ్చల్, ఆలేరుతో పాటు పలు కీలకమైన స్టేషన్లలో ఆగనున్నాయి. అక్కడి నుంచి వారు ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారానికి చేరుకోవచ్చు. కాగా, తెలంగాణలోని ములుగు జిల్లా పరిధిలో వన దేవతలు సమ్మక్క సారక్కల జాతర జరుగుతుంది. పెద్ద సంఖ్యలో తరలి రానున్న భక్తులకు ఈ ప్రత్యేక రైలు సర్వీసులు ఉపయోగపడనున్నాయి.

## మేడారం జాతర దృష్ట్యా 4 రోజులు ఇసుక విక్రయాల నిలిపివేత

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం శ్రీ సమ్మక్క – సారలమ్మ మహా జాతర దృష్ట్యా ములుగు, భద్రాది కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో ఇసుక విక్రయాలను నిలిపివేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు, భద్రాది కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో ఈ నెల 21 నుంచి 24 వరకు ఇసుక లోడింగ్, ఆన్‌లైన్ విక్రయాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అదే విధంగా ఇతర జిల్లాలకు పరిమితిలో ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని తెలిపారు.

## జాతరలో పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యత

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవతో జిల్లా పంచాయతీ విభాగం ద్వారా జాతరలో పారిశుధ్యం మెరుగుకు అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ఆలయ ప్రాంగణంతో పాటు భక్తులు దర్శనానికి వెళ్లే సెక్టార్లు, 4వేల మంది పారిశుధ్య కార్మికులను నియమించి పరిశుభ్రంగా ఉంచుతూ మేడారం పరిసరాలు స్వచ్ఛ పర్యవేక్షణ స్థలాలుగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి భక్తులే ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నారు.మేడారం శ్రీ సమ్మక్క, సారలమ్మ మహజాతర అమ్మవార్లను దర్శించుకునే ఆలయ ప్రాంగణం ముందు భాగంలో పారిశుధ్యం కార్మికులు పరిశుభ్రం చేయడం ఛాయాచిత్రం ద్వారా బంధించడం జరిగింది.ప్రజాప్రతినిధులు, అతిధులు ఎక్కువగా సందర్శించే ప్రాంతం కావడం అధికారులు నిరంతరం పర్యవేక్షించి పారిశుధ్యంపై చర్యలు చేపట్టడం హర్షించదగ్గ విషయం.

# సర్వాంగ సుందరంగా గద్దెల ప్రాంగణం

**భక్తులతో కిక్కిరిస్తున్న మేడారం**



తలుచుకుంటేనే కరుణించే తల్లులు సమ్మక్క సారాలమ్మలు, అట్లాంటి తల్లుల దర్శనం కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. అమ్మవార్లు ఎప్పుడు గద్దెలకు వస్తారా అని ఎంతో మంది భక్తులు వేచి చూస్తున్నారు. బుధవారం సాయంత్రం సారలమ్మ గద్దె మీదకు రానున్న నేపథ్యంలో మేడారానికి భక్తుల తాకిడి పెరిగింది.
వేకువజామున నుండే భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం కిటకిట లాడుతున్నాయి. క్యూ లైన్ లన్ని నిండి పోయాయి. వన దేవతల రాక సందర్భంగా సర్వాంగ సుందరంగా గద్దెల ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. ప్రధాన ద్వారం వద్ద వివిధ రకాల పూలతో ఏర్పాటు చేసిన అమ్మ వారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంటుంది. గద్దెల వద్ద ఎండోమెంట్, రెవెన్యూ, పోలీస్, ఫైర్, సింగరేణి రెస్క్యూ, ట్రాన్స్ కో, పంచాయతీ రాజ్ అధికారులు గద్దెల వద్ద అమ్మవారి సేవలో తరించిపోతున్నారు. గద్దెల వద్ద భక్తులు సమర్పించే బంగారాన్ని సానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు తీసివేస్తున్నారు.

## మిస్సింగ్ క్యాంపు పరిశీలన



మేడారం మహా జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మిస్సింగ్ క్యాంపు ను జిల్లా కలెక్టర్ఇలా త్రిపాఠి పర్యవేక్షించారు. జాతర పరిసరాలలో తప్పిపోయిన వారిని వారి వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు ఈ మిస్సింగ్ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి మిస్సింగ్ క్యాంపు లో ఒక జిల్లా స్థాయి అధికారీ నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.
భక్తులు ఎవరైనా తప్పి పాయిన లేద ఎవరైనా తప్పి పోయినట్లు తెలిసిన తమ దగ్గర లోని మిస్సింగ్ క్యాంపు లలో సమాచారం అందించాలన్నారు. జాతరలో రద్దీ ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో భక్తులు తమ చిన్న పిల్లలను , వృద్ధులను జాగ్రత్తగా చూసుకుంటూ అమ్మవార్లను దర్శించుకొని క్షేమంగా తమ తమ ఇళ్లకు చేరాలన్నారు.

## మేడారం జాతర @ కమర్షియల్

దాదాపు కోటిన్నర మంది హాజరయ్యే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పూర్తిగా కమర్షియల్ గా మారింది. గతంలో 50వేలలోపు భక్తులు హాజరయ్యే మేడారం జాతరకు 2020 నుంచి కోటికి చేరింది. దీనికి కారణం, సమ్మక్క, సారలమ్మ లపై ఉన్న అపార నమ్మకం, విశ్వాసం, కోరిన కోరికలను తీర్చే తల్లులుగా ప్రచారం. దీనికి తగ్గట్టుగా ప్రజల్లో పలు ఉదాహరణాల ద్వారా విశ్వాసం పెరిగింది. అయితే, ఈ మేడారం జాతర విషయంలో జాతర ప్రక్రియలో గిరిజన సంస్కృతీ, ఆచార, సాంప్రదాయాలలో ఇప్పటి వరకు ఏమాత్రం మార్పు రాలేదు. కాకపొతే, అప్రహతిహారంగా పెరుగుతున్న భక్తుల సంఖ్యను సొమ్ము చేసుకునేందుకు దేవాదాయ శాఖ ఇక్కడ అంటే, ఏమాత్రం రూపం లేని గద్దెల వద్ద అమ్మవార్ల బొమ్మలు పెట్టడం, గద్దెల ప్రాంగణం చుట్టూ, హిందూ దేవాలయాల మాదిరిగా నిర్మాణాలను చేయడం, సమ్మక్క సారలమ్మ ప్రసాదాలను ప్రవేశ పెట్టడం, సామాన్య భక్తులకు ఏమాత్రం అనుకూలంగా లేకుండా వీఐపీలకు దర్శనంలో ప్రాధాన్యత ఉండేలా తీసుకున్న చర్యలు గిరిజన సాంప్రాదాయ ఆనవాళ్లు దూరం చేసేవి క్రమ క్రమముగా ప్రారంభమయ్యాయి. ఒక్క ఆదివాసీ గిరిజనులు తమ సాంప్రదాయం ప్రకారం పూర్తిగా ఆదివాసీ ప్రకారంగానే సమ్మక్క, సారలమ్మ, పడిగిద్ద రాజు, గోవిందరాజులను వనం నుంచి గద్దెల వరకు తేవడంలోనే నిజమైన ఆదివాసీ సంస్కృతీ స్పష్టంగా కనిపిస్తోంది. మిగిలినవన్నీ, కమర్షియల్ అయ్యాయి.